దమ్ము చక్రాల ట్రాక్టర్లతో రోడ్లు ధ్వంసం

- నిబంధనలు పాటించని ట్రాక్టర్ యజమానులు
- పట్టించుకోని అధికారులు



కాజులూరు-రామచంద్రపురం రహదారిలో తర్లంపూడి వద్ద రోడ్డుపై యథేచ్ఛగా ప్రయాణిస్తున్న దమ్ముచక్రాల ట్రాక్టర్



దమ్ముచక్రాల ట్రాక్టర్ వెళ్లడంతో ధ్వంసమైన కాజులూరు-ఒంటితాడి రహదారి

కాజులూరు: నియోజకవర్గంలో గ్రామీణ రహదారులు దమ్ముచక్రాల ట్రాక్టర్ల రాకపోకలతో ధ్వంసమవుతున్నాయి. ఏటా ఖరీఫ్, రబీల్లో పంట దమ్ముల సమయాల్లో ట్రాక్టరు యజమానులు దమ్ము చక్రాలతో రోడ్లపై యథేచ్ఛగా పయనిస్తూనే ఉన్నాయి. అయినప్పటికీ రహదారులకు సంబంధించిన ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులు కానీ, పోలీసు విభాగం కాని వాటిపై చర్యలు చేపట్టడం లేదు. గ్రామీణ రహదారుల్లో దమ్ము చక్రాల ట్రాక్టర్లు నిరోధించడంలో స్థానిక అధికారులు సైతం విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గోదావరి నది నుంచి డెల్టా కాలువలకు ఇరిగేషన్ అధికారులు నీరు విడుదల చేయడంతో పాటు గ్రామాల్లో చెదురుమదురుగా వర్షాలు కురుస్తుండటంతో రైతులు పొలాల్లో పంటదమ్ములు చురుగ్గా నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని కాజులూరు, కె.గంగవరం, రామచంద్రపురం మండల గ్రామాల్లో సుమారు 600 ట్రాక్టర్లు ఉన్నాయి. దమ్ము చేసే సమయంలో ఈ ట్రాక్టర్లకు ఇనుప చక్రాలను బిగించి పొలాల్లో దమ్ము చేస్తుంటారు. ఈ క్రమంలో ట్రాక్టరు డ్రైవర్లు, యజమానులు ఒక పొలం నుంచి మరో పొలానికి వెళ్లేందుకు ఇనుప చక్రాలతోనే ట్రాక్టర్లతో యథేచ్ఛగా రోడ్లపై తిరుగుతుండటంతో రూ.లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, తారురోడ్లు ధ్వంసమవుతున్నాయి. ఫలితంగా రూ.కోట్లు ప్రజాధనం దుర్వినియోగమవుతుంది. ఇనుప చక్రాల దెబ్బకు రోడ్లు పగుళ్లు తీసి రాళ్లు లేచిపోవడంతో రహదారులు అధ్వానంగా తయారవుతున్నాయి. నియోజకవర్గంలో కాకినాడ-కోటిపల్లి, యానం-ద్వారపూడి, కాజులూరు-రామచంద్రపురం, గొల్లపాలెం-యానం రహదారులతో పాటు పలు గ్రామీణ రహదారులు దమ్ము చక్రాల తాకిడికి గురై పాడైపోతున్నాయి. దమ్ముచక్రాలతో రోడ్డుపై ప్రయాణించేటప్పుడు బెల్టు ఏర్పాటు చేసుకోవాలని ఉన్నతాధికారులు చూచిస్తున్నా ట్రాక్టర్ యజమానులు లక్ష్యపెట్టడం లేదు. వీటిపై స్థానికులు ఫిర్యాదు చేసినా ట్రాక్టర్ యజమానుల్లో గ్రామ సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలువురు నాయకులు, గ్రామ పెద్దలు ఎక్కువగా ఉండడంతో వారిపై చర్యలు తీసుకునేందుకు, నోటీసులు ఇచ్చేందుకు పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు సాహసించలేకపోతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి దమ్ముచక్రాల ట్రాక్టర్ల భారీ నుంచి గ్రామీణ రహదారులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారులు ధ్వంసం



మండల గ్రామాలలో పలు గ్రామీణ రహదారులు శిథిలమై మరమ్మతులకు సైతం నోచుకోక అధ్వానంగా ఉన్నాయి. వాటిపై దమ్ముచక్రాల టాక్టర్లు ప్రయాణించడం వలన మరింత దారుణంగా తయారవుతున్నాయి. అధికారులు పంటదమ్ములు పూర్తయ్యే వరకూ రహదారులపై నిఘా ఉంచాలి.

– అనసూరి శివనారాయణ, రైతు, టి.మామిడాడ

ఇనుప బద్దె ఏర్పాటు చేసుకోవాలి



ట్రాక్టర్ యజమానులు దమ్ము చేసేందుకై ఒక పొలం నుంచి మరో పొలానికి వెళ్లేందుకు టైరు చక్రాలు మార్చుకుని వెళ్లాలి. తప్పనిసరి పరిస్థితుల్లో దమ్ముచక్రాలకు ఇనుప బద్దెల ఏర్పాటు చేసుకోవాలి. ఈ విషయంపై అధికారులు ట్రాక్టర్ యజమానులకు అవగాహన కల్పించాలి.

– నల్లమిల్లి అచ్చిరెడ్డి, రైతు, మొగలిపాలెం

చర్యలు తీసుకుంటాం



దమ్ముచక్రాలతో ట్రాక్టర్లు రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ఇనుప బద్దెలు ఏర్పాటు చేసుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా రహదారులపై దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు పయనిస్తే నేరం. దానిని ఎవరైనా మా దృష్టికి వస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

– ఎం.మోహన్‌కుమార్, ఎస్సై, గొల్లపాలెం

క్లుప్తంగా

పీఎం ఫసల్ బీమాను సద్వినియోగం చేసుకోవాలి

కాజులూరు: ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన పథకానికి ప్రీమియం చెల్లించి ఈ పంటల బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. ఆదివారం కాజులూరులో ఆయన రైతులతో మాట్లాడుతూ 2025 ఖరీఫ్ పంటకు బీమా పొందాలంటే రైతులందరూ తప్పనిసరిగా రూ.770 ప్రీమియం చెల్లించాలన్నారు. బ్యాంకులు, సహకార సంఘాల్లో రుణాలు తీసుకున్న రైతులు సంబంధిత బ్యాంకుల్లోనే ప్రీమియం చెల్లించవచ్చని, రుణాలు లేనివారు రైతు సేవాకేంద్రాల్లో కాని, సీఎస్‌సీ మీసేవా కేంద్రాల్లో కాని ప్రీమియం చెల్లించవచ్చన్నారు. దీని ద్వారా ప్రకృతి వైపరీత్యాలతో పంటల నష్టం జరిగినప్పుడు రైతుకు పరిహారం లభిస్తుందన్నారు.

ఏరుపల్లి సర్పంచ్ శ్రీధర్ మృతి



మల్లిమొగ్గల శ్రీధర్ (ఫైల్)

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండలంలోని ఏరుపల్లి గ్రామ సర్పంచ్ మల్లిమొగ్గల శ్రీధర్ (71) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య బంగారం, కుమార్తె దేవి, అల్లుడు శేషుబాబు ఉన్నారు. శ్రీధర్ గ్రామీణ వైద్యుడిగా సేవలు అందిస్తూ ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్నారు. రాజకీయాల్లో ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్‌కు ఆప్తునిగా ఉంటూ ఏరుపల్లి గ్రామానికి మూడోసారి సర్పంచ్‌గా సేవలు అందిస్తున్నారు. ఒక పర్యాయం ఉప సర్పంచ్‌గా పదవీ బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయన మృతికి ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ తదితరులు తమ సంతాపం తెలిపారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలిగా 'కొప్పన'



కొప్పన లక్ష్మి

కాజులూరు: జిల్లా బీజేపీ ఉపాధ్యక్షురాలిగా జగన్నాథగిరి ఎంపీటీసీ కొప్పన లక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నుంచి తనకు ఉత్తర్వులు అందినట్టు లక్ష్మి తెలిపారు. సుమారు 15 ఏళ్ల పార్టీలోని వివిధ విభాగాల్లో పనిచేసిన కొప్పన లక్ష్మి గత స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ తరఫున ఎంపీటీసీగా పోటీ చేసి గెలుపొందారు. పార్టీకి తాను చేసిన సేవలు మెచ్చి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలిగా నియమించిన నాయకులకు ఎప్పుడు రుణపడి ఉంటానని, పార్టీ అభివృద్ధికి కృతనిశ్చయంతో పనిచేస్తానని లక్ష్మి తెలిపారు.

రోటరీ వాటర్ ప్లాంట్ ప్రారంభం



అన్నాయిపేటలో రోటరీ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కల్యాణ చక్రవర్తి

రామచంద్రపురం రూరల్: మండలంలోని అన్నాయిపేటలో కాకినాడ రోటరీ క్లబ్ ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన రోటరీ జల కల్యాణం (మినరల్ వాటర్ ప్లాంట్)ను ఆదివారం ప్రజాప్రతినిధులు, రోటరీ క్లబ్ సభ్యులు ఘనంగా ప్రారంభించారు. సర్పంచ్ పెమ్మిరెడ్డి దొరబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కల్యాణ చక్రవర్తి చేతుల మీదుగా రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టుమెషీన్లు, విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, రోటరీ క్లబ్ జిల్లా అధ్యక్షుడు తడాల బుజ్జి, సెక్రటరీ సతీష్, వైఎస్ ఎంపీపీ శాకా చంద్రశేఖర సూర్యప్రకాశ్, గ్రామ ఉప సర్పంచ్ చల్లా బుజ్జి, గ్రామ పెద్దలు రావూరి సుబ్బారావు, పెమ్మిరెడ్డి మురళి, ఆకేటి భీమన్న, పంచాయతీ పాలకవర్గం, గ్రామస్తులు పాల్గొన్నారు.

గోదావరి పరవళ్లు

మామిడికుదురు: గోదావరి వరద పరవళ్లు తొక్కుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో తీర గ్రామాల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పెదపట్నం, పెదపట్నంలంక గ్రామాల్లోని రైతులు పశుగ్రాసంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులను ప్రతి రోజు నాటు పడవలపై తరలించుకోవాల్సిందే. గోదావరి వరద ప్రవాహంతో రైతులు అవస్థలు పడుతున్నారు. పడవలపై పచ్చగడ్డి, పాలు, వ్యవసాయ ఉత్పత్తులు తరలించుకోవడం ఎంతో కష్టంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల మొదటి వారంలో వరద ఉధృతితో ఇబ్బందులు పడ్డామని చెప్పారు. మళ్లీ వరద శాంతించడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. మళ్లీ రెండ్రోజుల నుంచి వరద పెరుగుతూ ఉడడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఆగస్టు నెలాఖరు వరకు గోదావరి వరదల సీజన్ కావడంతో తమకు అవస్థలు తప్పడం లేదని రైతులు పేర్కొన్నారు. వరద ప్రవాహం ప్రమాదకర స్థితికి చేరుకుండా శాంతించాలని రైతులు వేడుకుంటున్నారు.

కూటమి నిరంకుశ పాలన



పట్టణంలోని బంగ్లాతోటలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్ తదితరులు

- కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్
- 19, 20 వార్డుల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ

రామచంద్రపురం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిరంకుశ పాలన సాగిస్తుందని వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. పట్టణంలోని 19, 20 వార్డుల్లో ఆదివారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు ఇచ్చిన మేనిఫెస్టోను వివరిస్తూ కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ప్రజలను వివరించారు. సూర్యప్రకాశ్ మాట్లాడుతూ కూటమి పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయాలనే డిమాండ్లతో గ్రామ గ్రామానా, పట్టణంలోని మున్సిపాలిటీ వార్డుల్లోను బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని ఇంటింటికీ వెళ్లి వివరిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపుతూ కక్షపూరిత పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయకుండా అధికార కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా చేస్తున్న మోసాలను గమనించాలని కోరారు. వార్డు కౌన్సిలర్ జి.సీతారామలక్ష్మి, పార్టీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, పార్టీ నేతలు పోతంశెట్టి గోపాలకృష్ణ, సత్తి సాయిలక్ష్మి, సత్తి శంకర్‌రెడ్డి, చిట్టూరి శ్రీనివాసరావు, పిట్టా నాని, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సమాజానికి కృషి

మండపేట సదస్సులో నినదించిన విద్యార్థులు, యువత



మండపేట సదస్సులో మాట్లాడుతున్న విద్యార్థులు

కపిలేశ్వరపురం (మండపేట): రోజులు మారాయని, విద్యార్థులు, యువత తప్పుదారి పట్టారంటూ తరచూ వింటూ ఉంటాం. సమాజం గురించి ఆలోచించేవారు లేరా? భవిష్యత్తు అంటే ఉద్యోగం, డబ్బు సంపదనేనా? మంచి సమాజ నిర్మాణం సాధ్యం కాదా అనే ప్రశ్నలకు సమాధానాన్ని రాబట్టాలన్న లక్ష్యంతో ఆదివారం మండపేటలో యువజన విద్యార్థి సదస్సు నిర్వహించారు. పట్టణానికి చెందిన డాక్టర్ చల్లా రవికుమార్, డాక్టర్ చల్లా మెహర్ ప్రసన్న ఆదివారం యువజన, విద్యార్థులతో యువతరమా నీ పయనం ఎటు? నినాదంతో సదస్సు నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల నుంచి 80 మంది విద్యార్థులు సమాజాన్ని విశ్లేషిస్తూ మాట్లాడారు. రిటైర్డ్ ఆంగ్ల అధ్యాపకుడు కట్టా కృష్ణారావు, సామాజిక కార్యకర్త గౌరవ్ సంధానకర్తలుగా వ్యవహరించారు. విద్య లక్ష్యం కేవలం విజ్ఞానం, ఉపాధి మాత్రమే కాదని, వ్యక్తి సమగ్ర వికాసానికి, నైతిక విలువలు పెంపొందించుకునేందుకు, సామాజిక బాధ్యతలు అర్థం చేసుకోవడానికి దోహదం చేస్తుందని విద్యార్థులు అన్నారు. సంస్కృతి, సంప్రదాయాలనేవి మానవుల సంబంధాల నుంచి ఉత్పన్నమవుతాయన్నారు. మారిన సమాజంలో విద్య, ఉపాధి అవకాశాలు విశ్వవ్యాప్తమయ్యాయన్నారు. సమాజం లేకుండా వ్యక్తి ఒంటరిగా జీవించలేడన్నారు. తమను తాము తీర్చుదిద్దుకుంటూ సమాజ మార్పునకు కృషి చేస్తామని విద్యార్థి, యువకులు స్పష్టం చేశారు. మండపేటకు చెందిన విద్యావేత్త వల్లూరి సత్యనారాయణ చౌదరి (సతీష్) వ్యక్తిత్వ వికాసానికి సంబంధించి పలు అంశాలు వివరించారు. రాజమహేంద్రవరానికి చెందిన ప్రజా కళాకారుడు పి.సురేష్ సామాజిక అంశాలను ప్రతిబింబించే పాటలతో విద్యార్థులను ఆలోచింపజేశారు.

డాక్టర్ చల్లా వెంకట్రావు సేవలు అజరామరం

ప్రముఖ హోమియో వైద్యుడు చల్లా వెంకట్రావు 17వ వర్ధంతి సందర్భంగా సదస్సులో ఆయనకు నివాళులర్పించారు. వెంకట్రావు వైద్యుడుగా, సీనియర్ కమ్యూనిస్టు పార్టీ నాయకుడుగా, ప్రజా కళాకారుడుగా, ప్రజా సంఘాల నాయకుడుగా అనేక కోణాల్లో సమాజానికి సేవలందించారన్నారు. డీవీ రాఘువులు, పి.సురేంద్ర, పి.రామచంద్రారెడ్డి, బి.రాజేంద్ర, జి.సుధాకర్, జి.స్వామి ప్రసాద్, యు.గుణ, ఎస్.అజయ్, రాజా, బి.గోపాల్, టి.వసంతరావు, ఎస్.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో శివ పంచాక్షరి పారాయణ



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో శివ పంచాక్షరి పారాయణ

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం తిరుమల తిరుపతి అన్నమయ్య కళాక్షేత్రం నుంచి విచ్చేసిన విజయశంకర స్వామీజీ, చిన్నజీయర్ స్వామిజీ ముఖ్య అనుచరులు భవానీ ప్రసాద్, విశ్వభారతి స్వామి, ఆంధ్రా భద్రాచల వ్యవస్థాపకుడు రామకోటి సుబ్బారావు తదితరుల ఆధ్వర్యంలో శివ పంచాక్షరి పారాయణను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో అన్నమయ్య కళాక్షేత్రం ఉత్తర కోస్తా జిల్లాల అధ్యక్షుడు సానా నూకరాజు, కోనసీమ జిల్లా అధ్యక్షుడు కుంపట్ల బాపన్నాయుడు, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షురాలు తులసి, ద్రాక్షారామ, పరిసర గ్రామాల భజన గురువులు, భజన కళాకారులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కేశవరంలో వైద్య శిబిరం



కేశవరం వైద్య శిబిరంలో ఉచితంగా మందులు అందజేస్తున్న నిర్వాహకులు

కపిలేశ్వరపురం (మండపేట): కేశవరంలో ఆదివారం రాజమహేంద్రవరానికి చెందిన వేద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక శ్రీసరస్వతి ఇంగ్లీషు మీడియం పాఠశాలలో నిర్వహించిన శిబిరంలోని పలు విభాగాలను సర్పంచ్ పెదపాటి సత్యనారాయణమూర్తి, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్ ప్రారంభించారు. శిబిరంలో ప్రముఖ వెన్నెముక నిపుణులు డాక్టర్ తేజో ఫణీంద్ర, గైనకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మీ మృదుల 148 మందికి వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్ తేజో ఫణీంద్ర మాట్లాడుతూ 50 ఏళ్ల వయస్సు దాటిన వారిలో ఎముక బలహీనపడి సమస్యలకు దారితీస్తుందన్నారు. ఆ నేపథ్యంలో శిబిరంలో రూ.3వేలు ఖరీదైన ఎముక సాంద్రత పరీక్షలను ఉచితంగా చేశామన్నారు. గ్రామ పెద్దలు పెదపాటి సీతారామ్, ఉమామహేశ్వరరావు బీఎండీ యంత్రాన్ని ప్రారంభించారు. ఉచితంగా మందులను అందజేశారు. శిబిరంలో వార్డు సభ్యులు, సరస్వతి పాఠశాల, వేద పాఠశాల సిబ్బంది సేవలందించారు.

మాజీ సర్పంచ్ బెల్లం సత్యనారాయణ మృతి

కపిలేశ్వరపురం: వెదురుమూడి మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు బెల్లం సత్యనారాయణ ఆదివారం ఆకస్మికంగా మృతి చెందారు. అవివాహితుడైన ఆయన గ్రామాభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. సౌమ్యుడిగా పేరొందిన సత్యనారాయణ సర్పంచ్‌గా తన హయాంలో గ్రామంలో పలు అభివృద్ధి పనులను పూర్తి చేశారు. సర్పంచ్ చోడే రామలక్ష్మి, వైస్ ఎంపీపీ గుణ్ణం భానుప్రసాద్, నాయకులు చోడే సూరిబాబు, చోడే వెంకటేశ్వరరావు, మెర్ల రామకృష్ణ, నక్కా సింహాచలం తదితరులు సత్యనారాయణ మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

తూర్పు గోదావరి జిల్లాలో 'మండపేట' విలీనానికి కృషి

మండపేటలో జేఏసీ సమావేశంలో ఎమ్మెల్యే వేగుళ్ల వెల్లడి



మండపేటలో జేఏసీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట అసెంబ్లీ నియోజకవర్గాన్ని రాజమహేంద్రవరం కేంద్రంగా ఉన్న తూర్పు గోదావరి జిల్లాలో కలిపేందుకు ఐక్యంగా కృషి చేయాలంటూ నియోజకవర్గంలోని నాయకులు, ప్రముఖులు నిర్ణయించారు. ఆ విషయమై ఆదివారం మండపేటలో జేఏసీ సమావేశాన్ని నిర్వహించారు. జేఏసీ చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కామన ప్రభాకరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ తూర్పు గోదావరి జిల్లాలో విలీనం విషయమై తాను గతంలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నానన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వేగుళ్ల పట్టాభి రామయ్య చౌదరి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ధూళి జయరాజు మాట్లాడారు. మండపేట పట్టణం, రూరల్ గ్రామాలు విలీనానికి ప్రజలు సుముఖంగా ఉన్నట్టు చెప్పారు. కపిలేశ్వరపురం, రాయవరం మండలాల ప్రజల నుంచి స్పష్టత రావాల్సి ఉందన్నారు. కాంగ్రెస్ నాయకుడు కామన ప్రభాకరరావు మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలూ ఐక్యంగా ఉంటూ విలీనాన్ని సాధించాలన్నారు. చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి మాట్లాడుతూ మున్సిపల్ కౌన్సిల్‌లో చర్చిస్తామని చెప్పారు. వేగుళ్ల పట్టాభి రామయ్య చౌదరి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలతో కూలంకషంగా చర్చించాలన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు యారమటి వెంకన్నబాబు, ప్రజాసంఘం నాయకుడు ఉండ్రాజవరపు అర్జున్, బీజేపీ నాయకులు కోన సత్యనారాయణ, గొడవర్తి రామచంద్రరావు, మద్దాల సుబ్బారావు, కంకటాల మురళీ, టీడీపీ నాయకులు ఉంగరాల రాంబాబు, జొన్నపల్లి సూర్యారావు, జనసేన పట్టణ అధ్యక్షుడు నామాల చంద్రరావు, లయన్స్ క్లబ్ నాయకులు బొల్లంరెడ్డి సత్యనారాయణ, గుండు తాతరాజు, రోటరీ ప్రతినిధులు బొబ్బా రామకృష్ణ పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయ పాలకవర్గ సభ్యుల నియామకం

కపిలేశ్వరపురం: నల్లూరులోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవస్థానం పాలకవర్గ కమిటీ సభ్యులను నియమించారు. ఆదివారం కమిటీ సభ్యులు మండపేటలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కమిటీ చైర్మన్ గుణ్ణం రాంబాబు, సభ్యులు పాల్గొన్నారు.

జానపద కళాక్షేత్రం జిల్లా సమన్వయకర్తగా సతార్ స్వామి



ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణంలో సతార్ స్వామికి జ్ఞాపిక అందజేస్తున్న ఆధ్యాత్మికవేత్తలు

రామచంద్రపురం రూరల్: టీటీడీకి చెందిన అన్నమయ్య జానపద కళాక్షేత్రం జిల్లా సమన్వయకర్తగా ద్రాక్షారామకు చెందిన కైరం వీరవెంకట సత్యనారాయణ(సతార్ స్వామి)ని నియమించారు. ఆదివారం ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో అన్నమయ్య కళాక్షేత్రం నుంచి విచ్చేసిన విజయ శంకర స్వామీజీ, చిన్నజీయర్ స్వామిజీ ముఖ్య అనుచరులు భవానీ ప్రసాద్, విశ్వభారతి స్వామి, ఆంధ్రా భద్రాచల వ్యవస్థాపకుడు రామకోటి సుబ్బారావు తదితరులు సతార్ స్వామిని దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. వారు మాట్లాడుతూ ద్రాక్షారామలో అయ్యప్ప భక్తి రంజని భజన మండలి ద్వారా అందిస్తున్న ఆధ్యాత్మిక సేవలను కొనియాడారు. ఇటీవల 49 రోజుల పాటు ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద శ్రీరామ నామ సప్తాహం విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన సతార్ స్వామిని అభినందించారు. అన్నమయ్య జానపద కళాక్షేత్రం జిల్లా సమన్వయకర్తగా విశేష సేవలందించాలని ఆకాంక్షించారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

కపిలేశ్వరపురం (మండపేట): పట్టణంలో రథం గుడిగా పేరెన్నికగన్న జనార్దన శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణ పనులకు ఆదివారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని ఎమ్మెల్యే వేగుళ్ల ఆదేశించారు.

అదుపుతప్పితే అంతే సంగతులు



బెర్మలు లేక కోట వద్ద ప్రమాదకరంగా రహదారి

కె.గంగవరం: ఆహ్లాదకరంగా ఉందని గోదావరి చూస్తూ ఆదమరిచి వాహనాలు నడిపితే ఆసుపత్రిపాలవ్వాల్సిందే. ఆహ్లాదకరంగా ఉండే జొన్నాడ-యానం ఏటిగట్టు రహదారికి బెర్మలు లేకపోవడం వల్ల ప్రయాణికులకు ముప్పుగా మారింది. పూర్తి స్థాయిలో బెర్మలు లేకపోవడంతో వాహనదారులు తరుచుగా ప్రమాదాల బారిన పడుతున్నారు. మండలంలోని కోటిపల్లి-కోట, బ్రహ్మపురి- గోవలంక మధ్య ఉన్న ఏటిగట్టు కోతకు గురై బెర్మలు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో పాటు రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వహనాలు కనబడక ప్రమాదాలు జరుగుతున్నారు. మరోవైపు ఇసుక లారీల స్పీడుతో గోదావరి గట్టు రహదారి పెద్ద పెద్ద గోతులు పడి ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి ఏటిగట్టు రహదారికి బెర్మలు ఏర్పాటు చేయడంతో పాటు గోతులను సరి చేయాలని ప్రయాణికులు ఏటిగట్టు పరివాహక ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

పుడమికి పచ్చని రంగేసినట్టు..



కె.గంగవరంలో కనుచూపుమేర వరినాట్లతో పచ్చదనంతో నిండిన పంట పొలాలు

కె.గంగవరం: మండల వ్యాప్తంగా ఇటీవల వర్షాలు విస్తారంగా కురవడంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఇప్పటి వరకు వర్షాలు అంతంతమాత్రంగా పడినా రైతులను మాత్రం నిరాశపరిచింది. అయితే గత రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు తొలకరి పనులు రైతులు మమ్మరం చేశారు. మండల వ్యాప్తంగా 95 శాతం నాట్లు పూర్తి అయ్యాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు వరద ఉధృతి పెరగడంతో కాలువలు, పంట బోదెలు, ఊటకాలువలు సాగు నీటితో నిండిపోయాయి.

కోటిపల్లిలోని ప్రధాన కాలువ, కె.గంగవరంలోని టేకి డ్రైన్, పామర్రులోని రాజు కాలువలు నీటి ప్రవాహంతో కలకళలాడుతూ ప్రవహిస్తున్నాయి. వర్షాలు పూర్తి స్థాయిలో కురవడం వల్ల నాట్లు పెరిగి పుడమి తల్లికి పచ్చబొట్లు వేసిన విధంగా పచ్చదనంతో పంటపొలాలు ఆహ్లాదంగా మారాయి.

మొక్కలు నాటిన చిన్నారులు



మండపేటలో ముస్లిం చిన్నారుల ర్యాలీ

కపిలేశ్వరపురం (మండపేట): జమాత్ ఎ ఇస్లామీ అనుబంధ చిల్డ్రన్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ (సియో) జాతీయస్థాయిలో పర్యావరణ పరిరక్షణకు ప్రారంభించిన ప్రత్యేక కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. మట్టిలో చేతులు – హృదయంలో దేశం॥ పేరుతో నెల రోజులుగా ముస్లిం చిన్నారులు పట్టణంలో పలు చోట్ల మొక్కలను నాటారు. వారికి వ్యాసరచన, చిత్రలేఖనం, తదితర ప్రతిభా పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. పట్టణంలో ఆదివారం చిన్నారులతో పర్యావరణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక జమాత్ ఎ ఇస్లామీ మహిళా విభాగం అధ్యక్షురాలు అయేషా, సియో బాధ్యురాలు మొహతాబ్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులన్న ప్రాధాన్యతను గుర్తించి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హుమైరా, షమ్మి, సబిహా, జమాఅతె సభ్యులు రిజ్వాన్, జైనులాబుద్దీన్ పాల్గొన్నారు.